అధిక ఊగిసలాట!



సమీక్ష : స్టాక్ మార్కెట్ సూచీలు బులిష్ ధోరణిని కొనసాగిస్తున్నాయి. ప్రధాన షేర్లు పెరగడం, ద్రవ్యోల్బణం కిందకు దిగి రావడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూలతలు ఇందుకు కారణాలు. మొదట మార్కెట్ స్తబ్దుగా ఉన్నా.. ఐరోపాలో డెట్ పేపర్ల వేలం; మైనా వృద్ధి గణాంకాలతో జోరందుకుంది. ఆర్థిక ఫలితాలూ బాగుండడంతో సెంటిమెంటు మరింత మెరుగైంది. ఆహార ద్రవ్యోల్బణం వరుసగా మూడో వారమూ ప్రతికూలంగా ఉండడం, ఐరోపాకు ఐఎమ్ఎఫ్ సహాయ ప్యాకేజీని విస్తరిస్తుందన్న వార్తలతో సెన్సెక్స్ మొత్తం మీద 584 పాయింట్లు లాభపడి, 16739 వద్ద ముగిసింది.

ఎఫ్ఐఐల తీరు : డాలర్‌తో రూపాయి మారకం విలువ బలపడిన నేపథ్యంలో ఎఫ్ఐఐలు రూ.3,535 కోట్ల నికర కొనుగోళ్లు చేయగా, పెరిగిన మార్కెట్లలో మ్యూచువల్ ఫండ్లు రూ.158 కోట్ల నికర అమ్మకాలు జరపడం గమనార్హం.

రంగాల వారీగా : ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడంతో స్థిరాస్తి షేర్లలో ర్యాలీ కనిపించింది. షేర్ల తిరిగి కొనుగోలు ప్రకటనతో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు ఎగశాయి; చమురు-సహజవాయువుల రంగం రాణించింది. మెరుగైన త్రైమాసిక ఫలితాలు, పరపతి విధాన సమీక్షలో ఆర్‌బీఐ కీలక రేట్లను తగ్గిస్తుందన్న అంచనాల కారణంగా బ్యాంకు షేర్లు లాభపడ్డాయి. ఎఫ్ఎమ్‌సీజీ, ఆరోగ్య సంరక్షణ రంగం వంటి రక్షణాత్మక రంగాలు కొంచెం డీలా పడ్డాయి. కంపెనీలు భవిష్యత్ అంచనాలపై జాగ్రత్తగా వ్యవహరించడం ఐటీ కౌంటర్‌లో లాభాలను పరిమితం చేసింది.

శుక్రవారం నాడు లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 1:1గా నమోదై, రికవరీ తరువాత స్థిరీకరణ జరుగుతుండటాన్ని సూచిస్తోంది.

భవిష్యత్ అంచనా : వరుసగా మూడో వారమూ మార్కెట్ లాభాలు ఆర్జించింది. సెన్సెక్స్ 16782 పైకి దూసుకెళ్లడం చూస్తుంటే స్వల్ప కాలంలో దిద్దుబాటును అంచనా వేయొచ్చు. మధ్య కాలానికి మార్కెట్ బలంగానే ఉండొచ్చు. సెన్సెక్స్‌కు తదుపరి కీలక నిరోధం 200 రోజుల చలన సగటు (డీఎమ్ఏ) అయిన 17384 వద్ద ఉంది. అధోముఖంలో చూస్తే, 15478 దిగువకు వెళితేనే మధ్య కాలానికి పతన బాటలో తిరిగి పయనించే అవకాశం ఉంది.

ప్రభావిత అంశాలు : దిశానిర్దేశం కోసం దేశీయ మార్కెట్ సూచీలు అంతర్జాతీయ మార్కెట్లను గమనిస్తాయి. 24న ఆర్‌బీఐ పరపతి సమీక్షను మదుపర్లు సునిశితంగా పరిశీలించే వీలు ఉంది. సీఆర్ఆర్‌లో కోత విధిస్తే కొనుగోళ్లకు ఊతం లభించవచ్చు. జనవరి నెల డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు బుధవారం ముగియనుండడం మార్కెట్లో ఊగిసలాటను పెంచవచ్చు. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో ఎంపిక చేసిన షేర్లలో కదలికలు ఉంటాయి. గత వారం రూపాయి బలపడింది. ఈ ధోరణి కొనసాగితే ఊర్ధ్వముఖ పయనానికి మద్దతు లభించవచ్చు. ఎఫ్ఐఐల పెట్టుబడులు, అమెరికా నిరుద్యోగ; గృహ విక్రయ; జీడీపీ గణాంకాలనూ మార్కెట్ పరిశీలిస్తుంది.

తక్షణ నిరోధ స్థాయిలు: 17004, 17384, 17658 తక్షణ మద్దతు స్థాయిలు: 16360, 16037, 15885

స్వల్ప కాలంలో మార్కెట్లో అధిక ఊగిసలాట చోటు చేసుకోవచ్చు.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ